# ఒంటికాలి శివుడు

## బెజ్జారపు రవీందర్

కథ

"మల్లన్న తాత మల్లా గజ్జె గట్టిండు!!"

ఉరుక్కుంటూ వచ్చి ఎగవోస్తూ చెప్పిండా పిలగాడు. అప్పటి దాకా అక్కడ నా చుట్టూ కూర్చున్న వాళ్ళలో అలజడి చెలరేగింది. అందరి ముఖాల్లో ఆందోళన కనపడింది. అయితే, అదేమంత గొప్ప విశేషమో అర్థం కాలేదు నాకు!

జానపద కళలమీద పరిశోధనకోసం వాళ్ళ అడ్రస్ వెతుక్కుంటూ వచ్చాను. ఇప్పటి తరం కళాకారులతో పాటు, ఆ వారసత్వాన్ని అందించిన పాతతరం కళాకారుల్ని ఇంటర్వ్యూ చేసి వారి కళా రూపంలో, కథా సంవిధానంలో, గాత్రంలో, పరికరాల్లో, ప్రజల ప్రతిస్పందనల్లో వచ్చిన మార్పుల్ని రికార్డు చేయాలనేది నా ఉద్దేశం.

ఒగ్గుకథ చెప్పే ఆ ఇంటి పెద్ద మల్లయ్య లేడని, ఏదోపనిమీద అక్కడికి దగ్గరలో ఉన్న మండల కేంద్రానికి వెళ్ళాడని తెలిసి నిరుత్సాహపడ్డాను. అయితే మల్లయ్య కొడుకు కొమురయ్య ఇప్పటికీ ఒగ్గుకథ చెప్తుంటాడని తెలియడంతో అతనివద్ద నుండి సాధ్యమైనంత ఎక్కువ సమాచారం రాబట్టడానికి ప్రయత్నించాను.

కొమురయ్యకు వారసత్వంగా గొప్ప ఆస్తి రాలేదు కాని, ఒగ్గు కథ మాత్రం లభించింది. చిన్నప్పటినుండి తన తండ్రితో తిరిగేవాడు. పెద్ద శిక్షణ అవసరం లేకుండానే అతనికి ఆ విద్య అబ్బింది. మొదట నన్ను చూడగానే వాళ్ళ కళ్ళలో ఆశ కనపడింది. కాని నేను రెవిన్యూ ఉద్యోగిని కాదని, కనీసం పశువుల కాంపౌండర్‌ని కాదని తెలిశాక వాళ్ళలో నా పట్ల ఆసక్తి చచ్చిపోయింది.

కొమురయ్యకు ప్రభుత్వం ఒక ఎకరం వ్యవసాయ భూమిని మంజూరు చేసింది. అయితే దాని హద్దులు, పట్టా విషయం తేల్చడానికి రెవిన్యూ అధికారులు సంవత్సర కాలంగా తమ చుట్టూ తిప్పించుకుంటున్నారట. అదే విషయం గురించి అడగడానికి తన తండ్రి మల్లయ్య ఎమ్మార్వో దగ్గరకి వెళ్ళిండని కొమురయ్య చెప్పిండు. కొమురయ్య కొడుకు అంజయ్య ఒక హోటల్లో పనిచేస్తుంటాడట. ఇట్లాంటివే కొన్ని కష్టాల్ని నాతో చెప్పుకున్నారు.

పూరిగుడిసె... దానినే రెండు భాగాలుగా చేసుకొని ఒక దాంట్లో మల్లయ్య, మరో భాగంలో కొమురయ్య ఉంటున్నారు. చుట్టూ రాళ్ళగోడ, దారి కోసం కట్టిన దడి... గుడిసె పక్కనే ఒక పెద్ద చింతచెట్టు దానికింద చిన్న మంచె, మంచెపై శుభ్రంగా కడిగి బోర్లేసిన గిన్నెలు... ఫక్తు పల్లెటూరి వాతావరణం నన్ను నా బాల్యంలోకి లాక్కుపోతోంది.

వాల్చిన నులకమంచంపై పరచిన గొంగడి...మంచంపై నేను కూర్చుని ఉంటే, కొమురయ్య కుటుంబమంతా నా చుట్టూ మూగారు. ఒగ్గుకథ పట్ల నాకున్న గౌరవం, ఆసక్తి చూశాక వాళ్ళకి నా మీద ప్రేమ కలిగిందనుకుంటా. పక్కనే ఉన్న హోటల్ నుండి చాయ్ తెప్పించారు.

కొమురయ్య తన చిన్నతనంలో తాను చూసిన ఒగ్గుకథ వైభవ ప్రాభవాల గురించి చెప్పుకొచ్చాడు. తన తండ్రి ప్రదర్శనల గురించి తన్మయత్వంతో చెప్పాడు. ప్రస్తుతం కథ చెప్పడానికి సమయం ఎంత తగ్గించుకుంటున్నారో, కథా సంవిధానంలో, పాటలో ఎలాంటి మార్పులు వచ్చాయో చెప్పిండు. ఎన్ని మార్పులు వచ్చినప్పటికి ఇప్పటికీ పట్నాలు వేయించుకుంటున్న వాళ్ళ సంఖ్య తగ్గలేదని, ఎంతోమంది చదువుకున్నవాళ్లు, ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు కూడా పట్నాలు వేయించుకోవడమనే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని గర్వంతో అన్నాడు. అతను చెప్పే విషయాల్ని నోట్సుగా రాసుకుంటున్నాను. ఆవేశం ఆపుకోలేక పాట కూడా మొదలుపెట్టాడు.

"పూత పూత మామిళ్ళల్ల
పూతా మామిళ్ళకాడ
పురుషుడై... అహ పురుషుడై
పుస్తె గట్టినాడే..."

పాటలోని ఊపూ, రిథమ్ మనసు ఏ మూలనో మిగిలి ఉన్న అలసటను, అనీజీని తరిమేసింది. బాగా రిలాక్సయ్యాను.

అంతలోనే రాళ్ళగోడకు కట్టిన దడిని నెట్టుకుంటూ ఓ పధ్నాలుగేళ్ళ పిలగాడు వచ్చి అరుస్తూ చెప్పాడు-

"మల్లన్న తాత మల్లా గజ్జెగట్టిండు..." అని!

** ** **


"తాత ఇప్పుడెక్కడ ఉన్నాడురా అంజిగా?" అంటూ అడిగిండు కొమురయ్య గాబరాగా.

"తాశీలు ఆఫీసు ముందట" ఆయాసపడుతూ చెప్పిండు అంజి. అతని ఒళ్ళంతా చెమటలు ధారాపాతంగా కారుతున్నాయి. మళ్ళీ ఏం గుర్తొచ్చిందేమో, తన తండ్రి కొమురయ్యను పట్టుకుని గట్టిగా ఏడ్చిండు అంజి.

ఎక్కడి వాళ్ళక్కడ ఉన్నఫళంగా పరిగెత్తారు. మగవాళ్ళు సైకిళ్ళు అందుకున్నారు. ఆడవాళ్ళు గుండెలు బాదుకుంటూ ఉరికారు. వాళ్ళెందుకింత హైరానా పడుతున్నారో అర్థంకాక, తెలుసుకుందామని నేనూ నా స్కూటర్‌పై బయలుదేరాను.

** ** **

మళ్ళీ స్కూటర్‌ని వెనక్కి తిప్పి అంజిగాడిని దొరికించుకున్నా



ను. నా బండి మీద తీసుకువస్తానని చెప్పి ఎక్కించుకున్నాను. ఊరు దాటాక బండి ఆపాను. అసలేం జరిగిందో చెప్పమని అడిగాను.

వాడు చెప్పడం మొదలుపెట్టిండు.

"భూమి పట్టాకోసం ఎమ్మార్వో సారు దగ్గరకు పోయిండు మా తాత. ఎంబడి నన్ను గూడా తీసుకపోయిండు.

తాత అటు మాట్లాడితే ఇటు, ఇటు మాట్లాడితే అటు మొకం తిప్పుకుంటున్నాడు ఎమ్మార్వో సారు. గప్పుడెప్పుడో ఐదునూర్ల రూపాయలడిగిండుసారు. మా తాత ఇయ్యలే. అదీ కోపం ఆనికి. మా తాతకు యాష్టకొచ్చింది. ఏంది సారూ, నా మాటలు గంత సేదుగున్నయా? ఏది ఇంటలేవు. నేను నోరిప్పి కథ సెపితే నూర్ల జనం నోరు తెరుసుకొని ఇంటరు. గజ్జె గట్టి ఆటాడితే నన్ను మెచ్చుకోనోడు లేడు. గొంతిప్పి పాట పాడితే మంగళారతులు పట్టిన్రు. నువ్వేమో మొకం తిప్పుకోవడ్తివి అన్నాడు సారు తోటి. నువ్వే జెప్పు సారు, మా తాత మనసుకు ఎంత కష్టమనిపిస్తె గట్ల మాట్లాడి ఉంటడు! గీ మాటలకే గా సారుకు కోపమచ్చింది. ఏందిరా, బాగ మాట్లాడుతున్నవ్. నువ్ మాట్లాడుతున్నవని సినిమా జూసినట్లు నిన్నే చూడల్నా? నువ్వు పాట పాడితే మంగళారతులు పట్టిన్రా మరి మమ్మల్నేం జెయ్యమంటవ్, శాలువాలు గప్పి బిరుదులిచ్చి కాళ్ళు మొక్కుమంటవా? ఏందో పెద్ద శాస్త్రీయ సంగీత పండితుని లెక్కనో, పావుస్తారు లెక్కనో బాగా నీలుగుతున్నవ్ అని ఇష్టమచ్చినట్లు తిట్టిండు సారు..." అంటూ ఆగిండు అంజి.



అంజి ముఖం కోపంతో, అవమానంతో కటువుగా మారింది. బహుశా వాడికి తాతంటే బాగా అభిమానం కావచ్చు.

"మా తాత ఇగ ఒక్కటే మాట అన్నడు. అవును సారూ, నా కథను గంత తీసెయ్య వడ్తివి. అది గంత పనికిరాకపోతే మరి ఊర్లల్ల జన్మభూమి గ్రామసభలకు నా పోరగాండ్ల తోటి ఎందుకు కథలు చెప్పిత్తున్నరు? సెట్లు పెంచుమని, పిలగాండ్లను బడిల ఎయ్యుమని, ఆపరేషన్లు చేయించుకోమని మాతోటే ఎందుకు పాటలు గట్టిత్తున్నరు? గా శాస్త్రీయ సంగీత పోల్లతోటే గీ పాటలు పాడించుర్రి. ఆళ్ళనే ఊర్లల్ల తిప్పుర్రి. గవ్వీటికేమో మా పాటలు పనికత్తయి. కాని కొంచెం మంచి మాటలు మాట్లాడటానికి మాత్రం మే పనికిరాం! నువ్ చెప్పినోళ్ళంతా గొప్పోళ్ళేసారు. కాదన. కాని ఆళ్ళ విద్యకంటె నా పాట ఎట్ల తక్కువైతది? అని అన్నడు మా తాత.

ఇగ ఆ సారు కోపం సూడ, తరంగాలె. బల్లమీదున్న బండరాయిని భూమ్మీదికి ఇసిరి కొట్టిండు. అరే, గీన్ని బయటకు నూకెయ్యండిరా అని ఒర్రిండు. ఇగ గప్పుడు మా తాత జూసిన సూపు జూడాలే సారూ, మూడోకన్ను లేకున్నా, ఎదురుంగ సారు బూడిదైపోతడనుకున్నా! ఇగ బయటకచ్చి నిల్చున్నాం. నా దగ్గరున్న గజ్జెలు తీసుకున్నడు. కాలికి గట్టిండు. కథ జెప్పుడు షురూ జేసిండు. ఒక్కడే... ఎర్రటి ఎండల... ఎగురుతుండు..." అన్నాడు అంజి.

చివరి మాటలు చెప్పేటప్పుడు వాని గొంతు దుఃఖంతో నిండి పోయింది. కళ్ళవెంట బొటబొటా కన్నీరు కారింది.

మల్లయ్య ఆత్మాభిమానానికి ఆశ్చర్యమనిపించింది. అతని కళను అవమానించడంవల్ల మనసు బాగా గాయపడి ఉంటుంది. అందుకే అంతగా చదువులేని మల్లయ్య... కళే జీవితంగా గడిపిన మల్లయ్య... తన బాధను, దుఃఖాన్ని, సంతోషాల్ని అన్ని అనుభూతుల్ని తన కళారూపంలోనే వ్యక్తపరచుకుంటున్నాడు.

మల్లయ్య నిరసిస్తున్న పద్ధతి అద్భుతమనిపించింది. మనుషుల మధ్య ఉన్న కులవివక్షలాగే కళావివక్ష కూడా హేయమనిపించింది. హిందుస్తానీ గాత్ర విద్వాంసుడు ఎంత గొప్పవాడో... ఒక చిందు భాగవతులు... ఒక ఒగ్గు కథకుడు... అంతే గొప్పవాళ్ళు.

"మీ మల్లయ్య తాత ఒకప్పుడు బాగా ప్రదర్శనలు ఇచ్చేవాడనుకుంటా..." అన్నాను అంజయ్యనుద్దేశించి.

వాడి మొహం మెరిసింది.

"అప్పటికి నేను పుట్టలేదట. మా తాతతోటి పట్నాలు ఏయించుకుంటానికి, కథ చెప్పించుకుంటానికి పోటీ పడేటోళ్ళట. మా తాత పాట, సిందులు చూసి మనసుపడని ఆడదే లేదంటరు మావోళ్ళు. గిదే ముచ్చట గురించి మా అవ్వ తాతతోటి గూసులాడేదట" అన్నాడు వాడు.

మండల రెవిన్యూ ఆఫీసుకు వెళ్ళేసరికి అక్కడ జనం గుమిగూడి ఉన్నారు. జనాన్ని జరుపుకుంటూ వెళ్ళామిద్దరం.

అంతమంది జనం మధ్య ఆడుతూ, పాడుతున్న వృద్ధున్ని చూసి విభ్రాంతికి గురయ్యాను.

ఆ వృద్ధునికి ఒక కాలులేదు! పోయిన కాలు స్థానంలో జైపూర్ పాదం ఉంది. దానికి ఉండాల్సిన గజ్జెలు నేలమీద పడి ఉన్నాయి.

"ఒకసారి జీపు టక్కరైనప్పుడు మా తాత కాలుపోయింది..." అన్నాడు అంజి ఏడుస్తూ!

** ** **

ఒంటి కాలితో మల్లయ్య ఆడుతున్నాడు. శరీరమంతా చెమట ప్రవాహం. శివుని కొప్పునుండి జారిన గంగలా ఉంది చెమట. ఖద్దరు ధోతి, బనియను ధరించి, ప్రళయతాండవం చేస్తున్న ఒంటికాలి శివుడిలా ఉన్నాడు మల్లయ్య. ఒంటి కాలుతోనైనా అద్భుతంగా నాట్యమాడుతున్నాడు.

అతని నోటి వెంట వస్తున్న శబ్ద ప్రవాహాన్ని జాగ్రత్తగా అనుసరించాను. అది రేణుకా ఎల్లమ్మ కథ.

కళా జీవితంతో పండిపోయిన ఆ వృద్ధుడు...ఒక్క కాలుతో నాట్యమాడుతున్న ఆ నటరాజు...మట్టి పరిమళం లాంటి జానపదం పాట...

ఒక అపురూప దృశ్యాన్ని చూస్తున్నట్లనిపించింది!

ఆయాసంతో రొప్పుతున్నాడు మల్లయ్య. అడుగులు తడబడుతున్నాయి. ఏదో ఒక క్షణంలో కూలిపోబోతున్న శిఖరం మీది శిలలా తూలుతున్నాడు. అతన్ని చూస్తే జాలివేసింది. అతని దగ్గర గొప్ప ధనమేమీలేదు. రాజకీయ పలుకుబడి అంతకన్నా లేదు. అవార్డులు లేవు. బిరుదులు లేవు. అతనికి తెలిసిందల్లా ఒగ్గు కథ ఒక్కటే. తన కసినంతా... తన దుఃఖాన్నంతా... తన నిస్సహాయతనంతా... తన కళారూపంతో వెల్లబోసుకుంటున్నాడు.

ఒక ట్రాన్స్‌లో... ఒక మైకంలో మల్లయ్య కొట్టుకుపోతున్నాడనిపించింది. ఒక్కో కదలిక బలహీనంగా మారుతోంది. కళాస్థలిలో ఏనాడూ ఓడని మల్లయ్య ఈరోజు తడబడుతున్నాడు. అతను ఓడిపోకూడదు. మళ్ళీమళ్ళీ అనుకున్నాను మనసులో- అతను ఓడిపోకూడదు అని!

ఆఫీసులోపలికి వెళ్ళాను. సర్కారు వాసనేసింది. నాకు బుద్ధి తెలిసినప్పటి నుండి కోరుకునేవాడిని- ఆసుపత్రికి, పోలీస్‌స్టేషన్‌కి, గవర్నమెంటాఫీసుకి పనిపడి వెళ్ళొద్దని. ఎమ్మార్వో గదిలోపలికి దూసుకువెళ్ళాను. ఆ ఛాంబర్‌లో కూర్చున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను. వాడు యూనివర్సిటీలో నా క్లాస్‌మేట్- శాస్త్రి!

** ** **

ఎంతోకాలం తరువాత మళ్ళీ కలుసుకున్నాం. కాని ఆ ఆనందం

మా ఇద్దరిలోనూ కనపడలేదు. మొహం ముటముటలాడిస్తూ విష్ చేసిండు.

ఏ ఉపోద్ఘాతమూ లేకుండానే వాడిని అడిగాను.

"శాస్త్రీ, ఏమిటిదంతా?"

"బయట చూశావుగా ఉచిత ప్రదర్శన. ఇంకా నన్నేం చేయమంటావు?" అన్నాడు పొగరుగా.

శాస్త్రి నాన్నగారు శాస్త్రీయ సంగీతంలో మంచి పేరుమోసిన కళాకారుడు. ప్రభుత్వం నుండి సన్మానాల్ని, బిరుదుల్ని పొందినగొప్ప వ్యక్తి. ఆయనకి ఉన్న పరిచయాల వల్లనే శాస్త్రి ఉద్యోగం సంపాదించగలిగాడని అప్పట్లో మా యూనివర్సిటీలో అంతా అనుకునేవారు.

"పాపం... ఆ ముసలాయన్ని, అదే మల్లయ్యను ఎందుకలా సతాయిస్తావు? నీ వృత్తి ధర్మం ప్రకారం అతనికి చేయాల్సిన సహాయం చెయొచ్చుగా! కక్కుర్తికి కూడా ఒక హద్దంటూ ఉండాలి" అన్నాను కఠినమైన స్వరంతో.

శాస్త్రి నావైపు సూటిగా చూసిండు.

"నువ్వు మొదట్నుండీ ఇంతే... అనవసరమైన విషయాల్లో వేలు పెట్టడం మానవుగా" అన్నాడు అయిష్టమైన ముఖంతో.

శాస్త్రీ, నేనూ మొదట్నుండి భిన్నధృవాలం. యూనివర్సిటీలో ఇద్దరం వేర్వేరు ప్రపంచాలకు ప్రతినిధులుగా ఉండేవాళ్ళం. మా ఇద్దరి దృక్పథాలు వేరు... విద్యార్థి సంఘాలు వేరు... హాజరయ్యే సమావేశాలు వేరు!

"జానపద కళల్ని పరిశోధించడమే కావచ్చు. కాని ఒక కళాకారున్ని రక్షించుకోవడం ప్రస్తుత తక్షణావసరం. ప్రయత్నిస్తాను. గెలుస్తానా, విఫలమవుతానా అనేది వేరే విషయం"



నా ఆలోచనల్ని తుంచేస్తూ వాడే అన్నాడు, పెద్దగొంతుతో-

"నాలుగ్గంతులు వేసి అడుక్కునే వెధవ...తానో గొప్పకళాకారుడినని మిడిసి పడుతున్నాడు. నాముందే ఫోజు గొట్టబోయాడు. నా గురించి, మా కుటుంబం గురించి తెలియదులావుంది వాడికి. మెడబట్టి బయటకు గెంటేస్తే తీట తీరక అక్కడ కూడా ఎగురుతున్నాడు. ఎగరనీ... ఎగరనీ... ఉన్న ఆ ఒక్క కాలు విరిగేదాకా!" అన్నాడు చీదరించుకుంటూ.

నాకు అసహ్యమేసింది. కోపం పట్టలేకపోయాను. పిడికిళ్ళు బిగించి, చేతులు గట్టుకొని బిగుసుపోయి అలాగే కూర్చుండిపోయాను. మరేం చేయను? నావద్ద పాశుపతాస్త్రమూ లేదు, శివుని శూలమూ లేదు. ఏంచేయాలా అని ఆలోచిస్తూ ఉన్నాను.

నా ఉనికిని భరించలేనట్లు విసుగ్గా మొహం పెట్టి,

"నాకు పనుంది" అన్నాడు. ఇక వెళ్ళొచ్చు అని అర్థం. నేను కదల్లేదు. కొన్ని నిమిషాల గడిచాయి. ఇక లాభం లేదనుకున్నాడేమో

"అసలు నువ్వెక్కడుంటున్నావ్, ఏం చేస్తున్నావ్? కాలేజీ రోజుల్లో ఆవారాగా తిరిగేవాడివి. ఇప్పుడూ అంతేనా? అయినా ఇక్కడికి ఏం పనిమీద తమరు విచ్చేసినారో తెలుసుకోవచ్చా?" అంటూ వ్యంగ్యంగా అడిగిండు.

"నా ఉద్యోగం, సద్యోగం సంగతి ఎందుకులే. ప్రస్తుతానికి మాత్రం జానపద కళలపై సామాజిక పరిణామాల ప్రభావాన్ని పరిశోధించే ప్రాజెక్ట్ వర్క్ మీద వచ్చాను. ఇక్కడికి వచ్చాక మీ నిర్వాకం తెలిసింది" అన్నాను.

"ఇంకేం, లైవ్‌షో జరుగుతోంది కదా. వెళ్ళి బాగా పరిశోధించుకో" అని నిర్లక్ష్యంగా అన్నాడు.

శాస్త్రికేసి చూసి నవ్వాను. నా ఆలోచనలకు ఓ రూపం వస్తోంది.

"నీకో ఉదాహరణ చెప్పాలి శాస్త్రీ! ఒక డాక్టర్ ఉన్నాడనుకో. అతని ఎదురుగా ఒక అమాయకున్ని కొంతమంది కొడుతున్నారనుకో. డాక్టర్ ఏంచెయ్యాలి? ఆ అమాయకుడికి గాయాలయ్యేదాకా ఓపికగా ఎదురుచూసి... గాయాలయి, తనవద్దకు వస్తేనే తన డ్యూటీ మొదలవుతుందని అనుకుంటే... అట్లాంటివాడిని మూర్ఖుడంటాను నేను. నేను మూర్ఖున్ని కాదు. నా పని జానపద కళల్ని పరిశోధించడమే కావచ్చు. కాని ఒక కళాకారున్ని రక్షించుకోవడం ప్రస్తుత తక్షణావసరం. ప్రయత్నిస్తాను. గెలుస్తానా, విఫలమవుతానా అనేది వేరే విషయం" అంటూ శాస్త్రి మాటకోసం ఎదురుచూడకుండానే బయటకు నడిచాను.

ఆఫీసు బయట చాలామంది జనం వచ్చి చేరారు. ఆట ఆపమని మల్లయ్యను కొమురయ్య బతిమిలాడుతూనే ఉన్నాడు. మల్లయ్య వినడంలేదు. పాట ఆట ఆపడంలేదు. గొంతు జీరబోయి ఉంది. కాళ్ళు తడబడుతున్నాయి.

నేను కొమురయ్యను బయటకులాగి అతనికి శాస్త్రి విషయం చెప్పాను. పరిష్కారమూ చెప్పాను. కొమురయ్య, అంజి ఊర్లోకి పరుగెత్తారు. ఆఫీసు నుండి శాస్త్రి బయటకెళ్ళకుండా కొమురయ్య తన బంధువుల్ని కాపలాగా పెట్టిండు.

శాస్త్రి రెండుమూడుసార్లు బయటకు వచ్చిండు. మళ్ళీ లోపలికి వెళ్ళిండు. జనాన్ని చూసి జడుసుకున్నాడేమో! ఒక గంట గడిచింది. ఇంతలో రెండు ఆటోల్లో కొమురయ్య, అంజి ఇంకొంతమంది దిగారు. వాళ్ళ చేతుల్లో డప్పులున్నాయి. కాళ్ళకు గజ్జెలున్నాయి.

ఆఫీస్ ప్రహరీగోడపైకి ఎక్కి జనాన్ని ఉద్దేశించి కొమురయ్య గట్టిగా అరుస్తూ చెప్పిండు-

"అందరు ఇనున్రి. ఇక్కడి ఎమ్మార్వో సారు మా ఇనాం భూమిని మాకు చూపెట్టటానికి, పట్టాలిచ్చుటానికి పైసలడిగిండు. అదీగాక మా విద్యను అవమానించిండు. ఒగ్గుకథ మా నెత్తుర్ల కలిసి ఉన్న విద్య. మమ్మల్ని తిట్టినా పడ్తం. మా విద్యను తిడితే పడం. ఊకోం. మా అయ్య ఆగినా నేను మొదలుపెడతా. నేను ఆగితే నా కొడుకు. ఆడి పాడి మా పానాలు పోవాలేగాని మేం ఆపం. మాకు న్యాయం చేసేదాకా ఆపం" అన్నాడు.

అక్కడికి వచ్చిన జనానికి అప్పుడు విషయం అర్థమయింది. డప్పుల దరువుతో కొమురయ్య ప్రదర్శన మొదలుపెట్టిండు. ఒక కళాజాతర జరుగుతున్నదా అన్నట్టుంది ఆ దృశ్యం! ఆ ప్రదేశమంతా పాటల పూలు పూసినయ్. నా కెమెరాతో ఆ దృశ్యాల్ని ఫోటో తీస్తుంటే పోలీసులు వచ్చారు. బహుశా శాస్త్రి ఫోన్ చేసిండేమో!

అందర్నీ తోసుకుంటూ పోలీసులు ఆఫీసు లోపలికి వెళ్ళారు. లోపల ఏం మంతనాలు జరిగాయో మళ్ళీ బయటకు వచ్చారు. నేను ఎస్.ఐ.ని కలిసి పరిస్థితిని అంతా వివరించాను. ఇంకా ఉపేక్షిస్తే ఒగ్గు కళాకారులందరు వచ్చి నిరవధిక ప్రదర్శనలు ఇస్తారని హెచ్చరించాను.

సాయంత్రం ఆరయింది. మల్లయ్య ఒరిగిపోయిండు. మధ్యమధ్యలో లేచి అటూ ఇటూ ఆడి మళ్ళీ పడిపోతున్నాడు. శివునిచుట్టూ చేరిన ప్రమథ గణాల వీరవిహారంలా ఉంది కొమురయ్య బృందం ఆట. జనం నిశ్శబ్దంగా కూర్చునే ఉన్నారు. పోలీసులు నావంక, జనం వంక కోపంగా చూస్తున్నారు. కాని ఏం చేస్తారు పాపం! బహుశా వాళ్ళలో కూడా ఏదో మూల ఈ కళాకారుల పట్ల సానుభూతి ఉండొచ్చు.

ఏడు గంటలయింది. చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఆ గుడ్డి వెలుతురులోనే కొమురయ్య తన కథలో లీనమైపోయిండు. వచ్చే జనం వస్తూనే ఉన్నారు.

చాలాసేపటికి ఆఫీసు లోపల్నుండి శాస్త్రి బయటకు వస్తూ కనిపించాడు. అతని ముఖంలోని భావాలు స్పష్టంగా కనపడడం లేదు. మనిషి మాత్రం భయపడుతున్నట్లే అనిపించింది.

దగ్గరికి రాగానే మల్లయ్యకేసి తిరిగి చేతులు జోడించి వినయాన్ని ప్రదర్శిస్తూ దండం పెట్టిండు.

మల్లయ్య కళ్ళలో సంతృప్తి! జనం చప్పట్లు, ఈలలు ఎక్కువయ్యాయి. దక్షవధ జరుగుతున్నంత కోలాహలంగా ఉందా ప్రదేశం. నేను నా స్కూటర్ వైపు నడిచాను.